క్లుప్తంగా

మాన్యం కౌలుకు వేలం



పెద్దకంబలూరులో వేలం వేస్తున్న దృశ్యం

రుద్రవరం: పెద్దకంబలూరు గ్రామంలో అంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన 22.96 ఎకరాల మాన్యం కౌలుకు శనివారం దేవదాయశాఖ అధికారులు వేలం నిర్వహించారు. రైతులు పోటాపోటీగా పాడటంతో ఆలయానికి ఆదాయం పెరిగిందని ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. గతేడాది వేలంలో రూ.1.79 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.3.48 లక్షలు సమకూరిందని చెప్పారు. గ్రామ పెద్దలు ఎర్రం నర్సిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్‌స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న రాత పరీక్షకు 88 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు మీ సేవా లేదా ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు.

జిల్లా అభివృద్ధికి పోరాటం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రజా సమస్యలపై సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా కృష్ణానది జలాలతో ఇతర రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందుతున్నా.. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో నీటి ఇక్కట్లను పరిష్కరించడం లేదన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో మహానందిలో జరిగే రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 25వ తేదీన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభ సందర్భంగా తీర్మాణాలు చేసి భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. మోటా రాముడు, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి దేవాలయ 33వ వార్షికోత్సవ వేడుకలు శనివారం శ్రీ అయ్యప్పస్వామి సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, స్నపన తిరుమంజనసేవ, తదితర పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. తదనంతరం గణపతిహోమం, నవగ్రహ హోమాలు చేపట్టి పూర్ణా హుతి గావించి మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టిశ్రీధర్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని అఖిల భారత విప్లవ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ శనివారం ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులు విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. డివిజన్‌కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): స్పందనలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు సమస్యలపై సచివాలయాలు, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు, మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను 24 గంటలలోపు సంబంధిత అధికారి పర్యవేక్షణ చేయని పక్షంలో జిల్లా కలెక్టర్ నుంచి షోకాజు నోటీసులు అందజేస్తారన్నారు.

పింఛన్ మొత్తం పెంచాలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. స్థానిక జగజ్జననీ నగర్‌లోని కార్యాలయంలో శనివారం డీఆర్‌డబ్ల్యూయూఏ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వికలాంగుల పింఛన్‌ను రూ.3116 నుంచి రూ.4016కు పెంచిందని గుర్తు చేశారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, పెన్షన్‌ను పెంచి వికలాంగులకు భరోసా కల్పించాలని కోరారు. నాయకులు కిరణ్‌కుమార్, ఎల్లయ్య, నబీరసూల్ పాల్గొన్నారు.

ఆటలకు సెలవు... బడే ఇక నెలవు



క్రిష్టిపాడులో సైకిల్ తొక్కడం నేర్చుకుంటున్న చిన్నారులు

● నేటితో ముగియనున్న వేసవి సెలవులు

దొర్నిపాడు: చిన్నారులు వేసవి సెలవులను ఎంజాయ్ చేశారు. కొందరు సెల్‌తో గడిపితే.. మరికొందరు గోలీలు, క్రికెట్ ఆడుకుంటే ఇంకొందరూ తూనీగలు, సీతాకోక చిలుకలను పట్టుకోవడం వంటి వాటిని చేసి తిరిగి చూసేలోపు 45 రోజుల సెలవులు పూర్తయ్యాయి. ప్రాథమిక పాఠశాలల నుంచి హైస్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ఇరుగు పొరుగు ఊర్లకు వెళ్లాల్సి ఉంటుంది. కావున బడికి వెళ్లేందుకు విద్యార్థులకు సైకిళ్లే కీలకం కానున్నాయి. ఇందుకు ముందస్తుగా తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లలకు సైకిళ్లు కొనిచ్చి తొక్కడం నేర్పించారు. రేపటి నుంచి ఆటలకు సెలవు ఇచ్చేసి.. పుస్తకాలను దోస్తీగా చేసుకోవాలి.



దొర్నిపాడులో సీతాకోకచిలుకలు, తూనీగలను పట్టుకుంటున్న బాలలు



ఈయన పేరు విశ్వనాథ రెడ్డి ఓబులంపల్లె గ్రామానికి చెందిన రైతు. గతంలో పచ్చిరొట్ట ఎరువులు వేయకుండా వరి పంట సాగు చేసేవారు. అయితే మూడేళ్ల క్రితం వ్యవసాయ అధికారులు పొలం వద్దకు వచ్చి వరి సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు చేసి పూత దశలో పొలంలో కలియదున్ని పంట సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని, జీలుగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై గ్రామంలోనే ఇస్తుందని చెప్పడంతో తొలిసారి వాటిని సాగు చేసి అధికారులు చెప్పినట్లు కలియదున్ని వరి నాటు వేశాడు. ఆ ఏడాది పంట బాగా పండింది. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గింది. అలాగే వడ్లు కూడా గతంలో కన్నా నాణ్యంగా ఉండటాన్ని గమనించి ఏటా వరి సాగుకు ముందు జీలుగ వేస్తున్నాడు.



ఈ రైతు పేరు తిరపతిరెడ్డి, వెంకటాపురం గ్రామ వాసి. ఈయన పొలంలో చౌడు అక్కడక్కడ ఉండటంతో దిగుబడి సరిగా వచ్చేది కాదు. అయితే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వరి సాగు చేయడానికి ముందు సబ్సిడీపై ఇచ్చిన జీలుగ విత్తనాలుతో సాగు ప్రారంభించాడు. మూడేళ్లలో చౌడు దాదాపుగా లేకుండా పోయింది. అలాగే.. రసాయనిక ఎరువులు వేసి సాగు చేసిన వాటి కన్నా ప్రస్తుతం పండుతున్న ధాన్యం నాణ్యంగా ఉంటున్నాయని చెబుతున్నాడు. జీలుగ సాగు వల్ల తనకు పురుగ మందులు, రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గిందని పేర్కొంటున్నాడు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

● 50 శాతం రాయితీపై ఆర్బీకేల్లో పంపిణీ
● సాగుకు సమయమిదే..
● ఏటేటా పెరుగుతున్న జీలుగ, పిల్లి పెసర, జనుము సాగు
● తగ్గనున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం



రుద్రవరం మండల పరిధిలో సాగైన జీలుగ

ఆళ్లగడ్డ: అన్నదాతలు ఖరీఫ్‌లో వరి నాట్లు వేసేముందు సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తుంది. పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు సేంద్రియ ఎరువుల సాగుకు ఉత్సాహం చూపుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఎరువుల వినియోగం..

అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు ఇష్టారాజ్యంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఏటేటా దిగుబడలు తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద ఏటికేడు తగ్గిపోతుండటంతో పొలాల్లో సేంద్రియ ఎరువులు వేయడం తగ్గింది. ఈ క్రమంలో గత్యంతరం లేక రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. పంటల సాగుకు నానాటికి పెరుగుతున్న పెట్టుబడులను నియంత్రించడంతతో పాటు భూసారాన్ని పెంచి.. నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసేలా ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ ఆర్బీకేల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచింది. పచ్చిరొట్టతో భూమి సారవంతంగా మారుతుండటాన్ని గమనించిన రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

సబ్సిడీపై విత్తనాలు..

సేంద్రియ సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తోంది. రైతులకు తమ గ్రామ ఆర్బీకే కేంద్రాల్లోనే వాటిని ఇస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని 81 రైతు భరోసా కేంద్రాల్లో 2 వేల క్వింటాళ్ల వరకు సిద్ధగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ఇప్పటికే ప్రారంభించారు.

ఇలా చేయాలి..

పచ్చిరొట్ట పైర్లను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఆ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే త్వరగా కుళ్లుతుంది. ప్రధాన పంటకు 50 కిలోల ఎరువును తగ్గించి వాడవచ్చు. పచ్చి రొట్ట మురగకుండా వేరే పంటలు వేయకూడదు. పచ్చిరొట్ట సాగు చేసే పొలాల్లో నత్రజని తక్కువగా ఉంటే ఎకరాకు 8 కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క పెరిగి రొట్ట ఎక్కువగా వస్తుంది.

ఉపయోగాలు..

⇨ భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది.

⇨ నేలలో కలియదున్నిన పంట కుళ్లేటప్పుడు విడుదల చేసే ఆమ్లాల వల్ల నేలలో మొక్కలకు భాస్వరం, పొటాష్ అందడమే కాక గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడటంతో నేల సారం పెరుగుతుంది.

⇨ భూమికి సేంద్రియ పదార్థం అందడం వల్ల నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి తద్వార పంట వేర్ల ఆరోగ్యం, పటుత్వం పెరుగుతుంది.

⇨ ఫలితంగా చీడపీడలు, పురుగుల బెడద తగ్గుతుంది

⇨ నాణ్యమైన దిగుబడి లభిస్తుంది

విత్తనాలు అందుబాటులోనున్నాయి



రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి నాణ్యమైన దిగుబడులే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు తీసుకుంటోంది. ఆర్బీకేల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 50 శాతం సబ్సిడీపై పంపిణీ కొనసాగుతోంది. అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకొని తీసుకోవాలి.

– రామ్మోహన్‌రెడ్డి , ఏడీఏ, ఆళ్లగడ్డ


మండలాల వారీగా అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు, ఆర్బీకేలు, సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు..

మండలం	ఆర్బీకేలు	రైతులు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	పచ్చిరొట్ట విత్తనాలు (క్వింటాళ్లలో)
రుద్రవరం	16	9.713	16.542	660
దొర్నిపాడు	9	4.360	10.574	200
ఆళ్లగడ్డ	12	11.280	19.250	320
శిరివెళ్ల	16	10.794	18.967	420
ఉయ్యాలవాడ	11	5.794	18.344	120
చాగలమర్రి	17	12.546	20.147	280



గుండుపాపల ఆర్బీకేలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందజేస్తున్న దొర్నిపాడు ఎంపీపీ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉదయాన్నే ఆలయాలకు చేరుకొని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎస్పీని కలిసిన సీఐలు



ఎస్పీని కలిసిన సీఐ తిమ్మారెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల వన్ టౌన్ సీఐగా బదిలీపై వచ్చిన రామకృష్ణ, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి శనివారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా యాడికి పోలీస్‌స్టేషన్ సర్కిల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణను పోలీసు ఉన్నతాధికారులు నంద్యాల వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీని కలిశారు. అలాగే కర్నూలు వన్ టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న తిమ్మారెడ్డిని బనగానపల్లె సీఐగా బదిలీ చేశారు.

కార్మికులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. శ్రీనివాసులు, కార్మిక సంఘం అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సెక్రటరీ ఈశ్వరమ్మ, మద్దమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

శిరివెళ్ల: యర్రగుంట్ల ప్రభుత్వ వైద్యశాలలో శనివారం గర్భిణులకు అన్నదానం చేశారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో 124 మందికి అన్నదానం చేపట్టారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతు వైద్యశాలలో ప్రతి నెల 9,10 తేదీల్లో గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తారని ఆ సమయంలో వారికి ఇబ్బందులు తలెత్తరాదని మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించామని చెప్పారు. వారిని వైద్యురాలు సాయితేజస్విణి అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన శిరివెళ్ల ఎస్‌ఐ

ఆళ్లగడ్డ: ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని శిరివెళ్ల సీఐ సురేష్ కలిశారు. ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన సురేష్ శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం మండలంలో శాంతి భద్రతలపై చర్చించారు.



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో శిరివెళ్ల ఎస్‌ఐ సురేష్

ముగిసిన శిక్షణ శిబిరాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథాలయ అధికారులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీ పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా రిటైర్డు లైబ్రేరియన్ సుబ్బారావు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాలను సందర్శించి న్యూస్ పేపర్లు, నీతి కథల పుస్తకాలు చదువుకొని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ మే 8 నుంచి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయన్నారు. పలు పాఠశాలల నుంచి దాదాపు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

శిరివెళ్ల: స్థానిక శాఖ గ్రంథాలయంలో నెలరోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం శనివారం ముగిసింది. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ మాట్లాడుతూ పాఠశాలల వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయంలో ఆటపాటలు,నీతికథలు,చిత్రలేఖనం, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించారన్నారు. దినపత్రికలు, జాతీయ, దేశనాయకుల జీవిత చరిత్రలను విద్యార్థులు చదివి తెలుసుకున్నారని చెప్పారు. గ్రంథాలయానికి అవసరమైన శాశ్వత భవన నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. అనంతరం ఆట, పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ సుజాత, సర్పంచు సాలమ్మ, రిటైర్డ్ ఏంఈఓ మహబూబ్‌బాషా, రిటైర్డ్ హెచ్‌ఎం రామకృష్ణ పాల్గొన్నారు.





నాడు.. అప్పనపల్లె-పందిర్లపల్లె మధ్య ఇరుకుగా ఉన్న రోడ్డు, నేడు.. విశాలంగా రోడ్డు వేస్తున్న దృశ్యం

తీరనున్న ప్రయాణ ఇక్కట్లు

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లె నుంచి పందిర్లపల్లె మీదుగా పెద్దకంబలూరు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండేది. సింగిల్ రోడ్డు అయినప్పటికీ గుంతల మయమవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు సమస్య పరిష్కరించాలని టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామ పెద్దలు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లారు.అయినా వారు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సమస్యను మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి చొరవతో రుద్రవరం–అప్పనపల్లె వరకు దాదాపు 5కి.మీ. బీటీ రోడ్డు వేసేందుకు రూ.3.19 కోట్లు మంజూరయ్యాయి. అయితే పనులు పూర్తి చేసినప్పటికీ నిధుల్లో కొంత మిగిలిందని, ఇలా.. పలు ప్యాకేజీ పనుల్లో మిగిలిన మొత్తాలతో అప్పనపల్లె, పందిర్లపల్లె, పెద్దకంబలూరు వరకు సింగిల్ రోడ్డును విస్తరిస్తూ బీటీ రోడ్డు పనులు చేపట్టినట్లు ప్రాజెక్ట్ ఏఈ వెంకటసుబ్బయ్య తెలిపారు. పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి, మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆళ్లగడ్డ రూరల్ సీఐ బదిలీ

ఆళ్లగడ్డ: రూరల్ సీఐ రాజశేఖర రెడ్డి బదిలీ అయ్యారు. రెండు సంవత్సరాలకు పైగా ఆళ్లగడ్డ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ రెడ్డిని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సర్కిల్ సీఐగా శనివారం ప్రభుత్వం బదిలీ చేసింది. గతంలో గుత్తి సీఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన 2020 డిసెంబర్ 30న ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన శైలిలో విధులు నిర్వర్తించడంతో ప్రజల మన్ననలను పొందారు.



సీఐ రాజశేఖరరెడ్డి

సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

చాగలమర్రి: ప్రజల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే పథకాల అమలు, పాలన తీరు, ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలుసుకోవాలనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముత్యాలపాడు బస్టాండులో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు షేక్ బాబులాల్, జి.కుమార్ రెడ్డి, బి. దామోదర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాలను వివరిస్తూ, పొందిన లబ్ధిని తెలియజేశారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని కోరారు. పలువురు ప్రస్తావించిన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. 1వ వార్డులో కొందరు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు శిథిలమయ్యాయని, కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపీడీఓ, మహబూబ్ దౌలా, పంచాయతీ ఈ ఓ సుదర్శనరావు, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, సిగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి, నాయకులు గణేష్ రెడ్డి, నాయబ్ రసూల్, చక్రం షబ్బీర్, ముల్లా.ఖాదర్ బాషా, ముల్లా షఫీ, రమణ, రాచమడుగు రమణ గుప్త, జగదీశ్వరరెడ్డి, గేట్ల మాబు తదితరులు పాల్గొన్నారు.



పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఉపాధ్యాయినులను అవమానించడం తగదు

నంద్యాల(న్యూటౌన్): కేజీబీవీ ఉపాధ్యాయినులను విద్యాశాఖ అధికారులు అవమానించడం తగదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లను నంద్యాల జిల్లా కేంద్రంలో ఎస్పీజీ స్కూల్‌లో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల షూ, బ్యాగులు, కిట్లను ప్యాకింగ్ చేయడానికి వైఎస్సార్ నగర్ నందిని జనరల్ కేజీబీవీ, మైనార్టీ కేజీబీవీ ఉపాధ్యాయినులను వినియోగించుకోవడం దారుణమన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చౌడప్ప పాల్గొన్నారు.

బాలుడిని మింగిన చెరువు

మహానంది: చెరువులో పడి 13 ఏళ్ల బాలుడు మృతి చెందడంతో మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన శివయ్య, లక్ష్మిలకు జగదీష్, చరణ్ ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జగదీష్(13) ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, ఊరంతా గాలించారు. ఆచూకీ లేకపోవడంతో చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ చెప్పులు, నీటి డబ్బా ఉండటం చూసి అందులోకి దిగి గాలించగా మృతదేహం లభ్యమైంది. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో వీకెండ్‌తో పాటు వివాహాలు జరగడంతో భక్తుల సందడి నెలకొంది. సుమారు పదికి పైగా వివాహాలు జరిగినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ మేరకు భక్తులు, నూతన వధూవరులు శ్రీ ఓంకారసిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



దస్తగిరి (ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామానికి చెందిన రైతు దస్తగిరి (45)అప్పుల బాధతో విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. వివరాలు.. శుక్రవారం రాత్రి తన పొలంలో విష గుళికలు మింగి తాను చనిపోతున్నానని కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లేలోపు మృతి చెందాడు. మూడేళ్లుగా తనకున్న రెండెకరాలతో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాడు. సాగు కలిసి రాక రూ.30లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని తీర్చే దారి కనిపించకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ, కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుడికి భార్య ఓబులమ్మతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక సాయిబాబానగర్ సమీపంలో ఉన్న విద్యుత్ కార్యాలయ ఆవరణలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. టూటౌన్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. విద్యుత్ కార్యాలయ ఆవరణలోని చెట్ల పొదల్లో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుదని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ

చాగలమర్రి: మండల కేంద్రం శివారులోని కట్టమీద దస్తగిరి స్వామి దర్గాకు వెళ్లే మార్గంలో అడ్డువాగు వద్ద చెరువు కట్టపై వెలసిన గంగా భవానీ ఆలయంలో శనివారం పోతురాజు విగ్రహ ప్రతిష్ఠోత్సవం వేడకగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు లక్ష్మయ్య యాదవ్, ప్రతాప్ రెడ్డి, నాగయ్య, ఆవుల కృష్ణయ్య పాల్గొన్నారు.

వైద్య సేవలు షురూ



గర్భిణికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని నూతన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో శనివారం డాక్టర్ నాగేంద్ర వైద్య సేవలను ప్రారంభించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి క్లినిక్‌ను ప్రారంభిచారు. శనివారం 56 మంది రోగులకు వైద్యచికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంచానికే పరిమితమైన చంద్రారెడ్డి, మహబూబ్‌కు వైద్య పరీక్షలు చేసి సూచనలు చేశారు. సొంత ఊరిలోనే వైద్యసేవలు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఎల్‌పీహెచ్ విమల, ఏఎస్‌ఎం మాణిక్యమ్మ, ఆశా వర్కర్లు లత, లక్ష్మి పాల్గొన్నారు.